# సంపాదకీయము

పూజ్యులు మన ఆది గురువులైన మహాత్మ శ్రీ రామచంద్రజీ (ఫతేఘడ్, యు.పి.), మనందరమూ ప్రేమగా పిలుచుకొనే లాలాజీ మహారాజ్ వారి 134వ జయంతిని జరుపుకొనుచున్నాము. ఈ సందర్భములో వారి జీవిత చరిత్రను ఒక మారు జ్ఞప్తికి తెచ్చుకొనిన వారు జన్మతః శ్రీమంతులైనప్పటికీ కాలక్రమములో వారి సంపద హరించి కడు బీదరికమును అనుభవించిరి. తినుటకు సరియైన ఆహారము లేక, కప్పుకొనుటకు దుప్పటిలేక అనేక కష్టములను ఎదుర్కొనిరి. వారు నివశించు ప్రాంతము ఉత్తరప్రదేశ్‌లో శీతాకాలము అమితమైన శీతలముగా నుండును. అటువంటి వాతావరణములో చిరిగిపోయిన గొంగళిని అనేకమంది పంచుకొనిన సందర్భము కలదు. ఆధ్యాత్మిక సామ్రాజ్యములో మార్గదర్శి అయిన అంతటి మహానుభావునికే ప్రాపంచికమైన బాధలు తప్పలేదు. అంతియేగాక వారు తీవ్రమైన అనారోగ్యముతో బాధపడునపుడు ఆ బాధను అనుభవించితిరే కాని దానినుండి ఉపశమనము కోరలేదు. వారి కనుచూపుతోనే అతి ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితులను ప్రసాదించగలిగిన మహానుభావుడు కూడా యిహలోక బాధలను అనుభవించిరే కాని వాటినుండి విముక్తి ప్రసాదించమని దైవమును ఏ సందర్భములోనూ కోరలేదు. వారి ప్రియతమ శిష్యులు మన గురుదేవులైన పూజ్య బాబూజీ మహారాజ్ వారు సత్యపథమార్గములో మనము పాటించవలసిన దశాదేశములను మనకు యిచ్చినారు. ఇవి వారికి అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితిలో వున్నప్పుడు వచ్చినవని చెప్పినారు. ఈ అదేశములలో 5 మరియు 7వ ఆదేశములను చదివి కొద్దిగా బోధపరచుకొనిన ప్రాపంచికమైన ఆనందము, విషాదము మరియు సుఖదుఃఖములు మన కర్మఫలములేనని బోధపడును. దీనికి అన్యులెవరు బాధ్యులు కారు. పైగా వాటిని దైవవరములుగా స్వీకరించి దైవమునకు కృతజ్ఞులమై యుండుట మన సాధనా విధానమునకు తోడ్పడును. పూజ్య బాబూజీ గారు మనకొసంగిన సాధనా విధానములను నియమానుసారముగా ఆచరించుచూ, వారి ప్రాణాహుతి సహాయమును పొందుచూ, వారు మనకొసంగిన దశాదేశములను పాటించుచూ, భక్తి, ప్రేమ మరియు విశ్వాసములను పెంపొందించుకొని పరిస్థితులకనుగుణముగా మన జీవనమును మలచుకొనవలెను. పూజ్య గురుదేవుల కృప అందరికీ కలగాలని కోరుకొంటున్నాను.

* * *